

చిన్నబోయిన 'చంద్రవంచ'

ఏ గ్రామంలో చూసినా బతుకమ్మ, దసరా పండుగ సందడి కనిపిస్తుండగా.. చంద్రవంచలో మాత్రం ఆ పరిస్థితి లేదు. 10లో▸



నిర్మాణ పనులు నిలిపేయాలి

అనుమతులు లేని ఇంటి నిర్మాణ పనులను వెంటనే ఆపేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య కోరారు. 10లో▸



రుణాలు చెల్లించండి

పంట రుణాలను సకాలంలో చెల్లించాలని నవాబుపేట పీఏసీఎస్ చైర్మన్ ఖాలీస్ రాంరెడ్డి రైతులకు సూచించారు. 11లో▸

న్యూస్‌రీల్

డీఎంహెచ్‌ఓ బదిలీ

జిల్లా ఇన్‌చార్జ్ వైద్యాధికారిగా డాక్టర్ పవిత్ర



అనంతగిరి: జిల్లా వైద్యాధికారి డాక్టర్ లలితాదేవి బదిలీ అయ్యారు. ఆమెను రంగారెడ్డికి బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలో ఎంసీహెచ్ ప్రోగ్రాం ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ వై పవిత్రకు ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లాలో వైద్య ఆరోగ్య సేవలను మరింత బలోపేతం చేస్తామన్నారు.

మంత్రి పొంగులేటిని కలిసిన మోనికారాణి



మంత్రి పొంగులేటితో మోనికారాణి

కుల్కచర్ల: ఇటీవల విడుదలైన గ్రూప్ -1 ఫలితాల్లో జిల్లా రిజిస్ట్రార్‌గా నియమితులైన మోనికారాణి మంగళవారం నగరంలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మొక్కను బహూకరించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని మంత్రి సూచించారు.

'అమ్మ నాన్న' సేవలు అభినందనీయం

డిప్యూటీ డీఎంహెచ్‌ఓ రవీంద్రయాదవ్



దివ్యాంగులకు దుస్తులు, కిరాణా సరుకులు అందజేస్తున్న రవీంద్రయాదవ్, ప్రవీణ్‌కుమార్

కొడంగల్ రూరల్: సమాజ సేవ చేయడం అభినందనీయమని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ రవీంద్రయాదవ్, తెలంగాణ విద్యా వంతుల వేదిక రాష్ట్ర కార్యదర్శి రవీందర్‌గౌడ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని రాఘవేంద్ర ఫంక్షన్ హాల్‌లో దసరా పండుగను పురస్కరించుకొని అమ్మా నాన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు కొత్త బట్టలు, కిరాణా సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అమ్మా నాన్న ఫౌండేషన్ ఫౌండర్ ప్రవీణ్‌కుమార్ సేవలు స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో సనాతన ధర్మ పరి రక్షణ సమితి సభ్యులు లక్ష్మీనారాయ గుప్తా, మిఠాయి రాజేందర్, బాకారం చంద్రశేఖర్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు శంకర్‌నాయక్, గౌరారం గోపాల్, నరేష్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత


ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



పూజలో ఎమ్మెల్యే టీఆర్ఆర్ తదితరులు

పరిగి: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే టీ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. పరిగి ఆర్టీసీ డిపోలోని దుర్గామాత ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ భక్తి మార్గంలో నడవాలని సూచించారు. భక్తితోనే ముక్తి లభిస్తుందన్నారు. అనంతరం అమ్మవారిని మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి దర్శించుకున్నారు.

సేవలే గుర్తుండిపోతాయి



హఫీజ్‌ను సన్మానిస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి

అనంతగిరి: విధి నిర్వహణలో మనం చేసిన సేవలే చిరకాలం గుర్తుండిపోతాయని ఎస్పీ నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం వికారాబాద్‌లో ఎస్‌బీ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న ఎండీ హఫీజ్ ఉద్యోగ విరమణ అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. దాదాపు 41 సంవత్సరాల పాటు పోలీసు శాఖలో ఉద్యోగం చేయడం గొప్ప విషయమన్నారు.



మోమిన్‌పేట్: ఎన్కెపల్లిలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

శోభితం బతుకమ్మ సంబురం

జిల్లాలో బతుకమ్మ సంబురాలు మిన్నంటాయి. మంగళవారం ఊరు వాడా పూల పండుగను ఘనంగా నిర్వహించారు. మహిళలు బతుకమ్మలను అందంగా పేర్చి ఆలపాటలతో సందడి చేశారు. గౌరమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేశారు. వేడుకల్లో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

– అనంతగిరి



అనంతగిరి: బతుకమ్మలతో మహిళలు, యువతులు

అదే అనిశ్చితి!



ఎన్నికల షెడ్యూల్ వచ్చినా రిజర్వేషన్లపై తొలగని ఉత్కంఠ

- ఆశావహుల్లో ఆందోళన
- కోర్టు తీర్పు కోసం ఎదురుచూపులు

వికారాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించడంపై ఉత్కంఠ నెలకొంది. ఈ అంశం హైకోర్టు పరిధిలో ఉండటంతో ఆశావహుల్లో ఆందోళన నెలకొంది. ఎన్నికల కమిషన్ షెడ్యూల్ విడుదల చేసినా ఇంకా అనిశ్చిత నెలకొంది. లోకల్ బాడీ పదవుల కోసం ఏడాదిన్నరగా ఎదురు చూస్తున్న వారిలో షెడ్యూల్ వెలువడినా ఆనందం కనిపించడంలేదు. స్థానిక సమరం రాజ్యాంగపరమైన చిక్కులతో ముడిపడి ఉన్న నేపథ్యంలో ఎన్నికలు జరుగుతాయా..? జరగవా..? ఒకవేళ నిర్వహించినా.. ప్రస్తుత రిజర్వేషన్లతో జరుగుతాయా..? లేక పాత వాటి ప్రకారం నిర్వహిస్తారా..? అనే చర్చ ఊపందుకుంది. రిజర్వేషన్లు అనుకూలంగా వచ్చినా ఆయా సామాజిక వర్గాల నాయకులు అడుగు ముందుకు వేయలేకపోతున్నారు. కోర్టు పరిధిలో ఉన్న అంశంపై కావడంతో తీర్పు వచ్చే వరకు ఎదురూ చూడక తప్పని పరిస్థితి నెలకొంది. ఈ అంశంపై స్పష్టత రావాలంటే మరో వారం రోజులు వేచి చూడక తప్పదు. ఇదిలా ఉండగా రిజర్వేషన్లు అనుకూలంగా వచ్చిన వారు ఎలా ముందుకెళ్లాలో తెలియక అయోమయంలో ఉన్నారు.

ముందుకా..? వెనక్కా..?

లోకల్ బాడీ ఎలక్షన్ ఏడాది కాలంగా ఊరిస్తూ ఎట్టకేలకు షెడ్యూల్ వచ్చేసింది. అన్నీ అనుకున్నట్లు జరిగితే మొదటి విడత నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కావడానికి మరో పది రోజుల సమయం మాత్రమే మిగిలి ఉంది. రిజర్వేషన్ల అంశం హైకోర్టు పరిధిలో ఉండటంతో ఆశావహులు 8వ తేదీ వరకు వేచి చూడక తప్పదు. అప్పటిదాకా వేచి చూస్తే గ్రూపులు, సంఘాలు, కీలకమైన వ్యక్తు లు దూరమయ్యే అవకాశం ఉంటుందని హై రానా పడుతున్నారు. వారు ఇతరు నేతలకు మాటిచ్చే అవకాశం లేకపోలేదని ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో అడుగు ముందుకు వేయడమే వారి ముందు ఉన్న కర్తవ్యంగా భావిస్తున్నారు. ఖర్చు విషయంలో కూడా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇప్పటి నుంచే ఖర్చు చేస్తూ పోతే పరిస్థితి తమకు ప్రతికూలంగా మారితే పెట్టిన డబ్బు వృథా అవుతుందని అంచనాకు వచ్చారు. దీంతో వారి పరిస్థితి ముందు గొయ్యి.. వెనుక నుయ్యి అన్న చందంగా మారింది.

ఇంకా అన్ రిజర్వుడ్ ఆశలు

ఎన్నికల హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ జీఓ జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తాజాగా ఎన్నికల సంఘం పంచాయతీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించింది. లోకల్ బాడీ ఎన్నికల్లో స్లాబ్‌కు లోబడి రిజర్వేషన్లు లేకపోవడంతో అసంతృప్తులు కోర్టును ఆశ్రయించేందుకు వీలు కలుగుతుంది. రాజ్యాంగంలోని 9వ, షెడ్యూల్‌లో చేర్చని ఏ అంశంపైన అయినా కోర్టులు జోక్యం చేసుకునేందుకు అవకాశం ఉంది. అయితే ప్రస్తుత చట్టాన్ని సవరించి 9వ, షెడ్యూల్‌లో చేర్చే ప్రాసెస్ ఏదీ చేయకుండానే రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ జీఓ జారి చేసింది. మరో వైపు అసెంబ్లీలో ఆమోదం పొందిన బిల్లుకు గవర్నర్ ఆమోదం లభించలేదు. ఇలాంటి చట్టం పరిపూర్ణం కాజాలదు. ఈ కారణం చేత కూడా ప్రస్తుతం ఇచ్చిన రిజర్వేషన్లపై కోర్టు అభ్యంతరం చెప్పే అవకాశం లేకపోలేదు. ప్రస్తుత రిజర్వేషన్లు నిలుస్తాయా..? రద్దువుతాయా..? అనే అయోమయం ఆశావహులను వీడటంలేదు. ఇదే సమయంలో ఆయా కారణాల వల్ల ప్రస్తుత రిజర్వేషన్లు రద్దయ్యే అవకాశాలను విశ్లేశిస్తూ చర్చ ఊపందుకుంది. దీంతో అన్ రిజర్వుడ్ స్థానాలపై ఆశలు పెట్టుకున్న జనరల్ ఆశావహుల్లో ఇంకా ఆశలు పదిలంగానే ఉన్నాయి. 8వ తేదీ కోర్టు తీర్పు కోసం వారు వేచి చూసే ధోరణిలోనే వారు ఉన్నారు.



కల్యాణ శోభిత స్వామి అమ్మవార్లు

నేత్రపర్వం శ్రీవారి రథోత్సవం

వికారాబాద్ పట్టణంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీ వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రథోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం శ్రీవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం కల్యాణోత్సవం జరిపించారు. రథోత్సవంలో కోలాటం, చెక్కభజన ఆకట్టుకుంది. వేడుకల్లో పలువురు ప్రముఖులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

– అనంతగిరి



వికారాబాద్‌లో కొనసాగుతున్న రథోత్సవం



తాండూరు: మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

కలిసి పనిచేద్దాం కారెక్కండి

- మహరాజుల కుటుంబాన్ని కోరిన పైలెట్
- మాజీ ఎమ్మెల్యే నారాయణరావుతో భేటీ
- బీఆర్ఎస్ నుంచి ఎంపీపీ, జెడ్పీటీసీ ఇస్తామని ఆఫర్
- కాంగ్రెస్ నిర్ణయం తేలాక చెబుతామన్న మహరాజులు



మాజీ ఎమ్మెల్యే నారాయణరావుతో చర్చిస్తున్న పైలెట్ రోహిత్‌రెడ్డి

బషీరాబాద్: జిల్లా, మండల పరిషత్ ఎన్నికలు రాజకీయ వేడి పుట్టిస్తున్నాయి. అధికార కాంగ్రెస్‌పై పైచేయి సాధించాలని ప్లాన్ వేసిన గులాబీ పార్టీ ఆదిశగా అడుగులు వేస్తోంది. తాండూరు నియోజకవర్గంలో కాంగ్రెస్ అంటేనే మొదట గుర్తొచ్చేది బషీరాబాద్‌లోని మహరాజుల కుటుంబం. ఈ ఫ్యామిలీకి పదవుల ఎర వేసి కారెక్కించాలని బీఆర్ఎస్ భావిస్తోంది. ఇందులో భాగంగా మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి మంగళవారం మాజీ ఎమ్మెల్యే నారాయణరావుతో సమావేశమయ్యారు. బషీరాబాద్‌లోని ఆయన నివాసానికి వెళ్లి సుమారు 45 నిమిషాల పాటు భేటీ కావడం చర్చనీయాంశమైంది.

వెల్‌కమ్ టు బీఆర్ఎస్ అంకుల్!

విశ్వసనీయవర్గాల సమాచారం ప్రకారం సాయంత్రం 4.50 గంటలకు నారాయణరావు నివాసానికి చేరుకున్న రోహిత్‌రెడ్డి 'నమస్తే అంకుల్.. ఎలా ఉన్నారు..? ఆరోగ్యం ఎలా ఉంది.. అంటూ పాదాభివందనం చేశారు. ఇక వెయిట్ చేయడం వేస్ట్.. వెల్‌కమ్ టు బీఆర్ఎస్ అంకుల్.. కలిసి పనిచేద్దాం .. కారెక్కండి' అని ఆహ్వానించారు. దీనికి నారాయణరావు.. నవ్వుతూ 'కమింగ్ సూన్..' అంటూ సమాధానం ఇచ్చారు. అనంతరం 30నిమిషాల పాటు నేతలిద్దరూ పలు అంశాలపై చర్చించారు. ఎన్నికల్లో మీరు అడిగిన సీట్లు ఇవ్వడానికి బీఆర్ఎస్ సిద్ధంగా ఉంది.. పార్టీలో చేరండి అని పైలెట్ కోరారు. దీనికి నారాయణరావు బదులిస్తూ.. 'వెంకటేశ్ మహరాజ్‌కు కాంగ్రెస్ తరఫున ఎంపీపీ సీటు ఖరారైంది. రాకేశ్‌మహరాజ్‌కు జెడ్పీటీసీ అడిగాం.. ఇంకా చర్చలు కొనసాగుతున్నాయి. మేము అజయ్‌ప్రసాద్‌తో కలిసి ఎన్నికల్లో పనిచేయడానికి సిద్ధంగా లేము.. నాలుగు దశాబ్దాలుగా నియోజకవర్గంలో ఎవరికి పదవులు కావాలన్నా మా కుటుంబం టికెట్లు ఇచ్చింది. ఇప్పుడు టికెట్లు కావాలని వారిని అడుక్కునే పరిస్థితి నెలకొంది. జెడ్పీటీసీ టికెట్‌పై కాంగ్రెస్ నిర్ణయం కోసం 24గంటలు వేచి చూస్తాం. ఆతర్వాత అందరం కలిసి ఒక నిర్ణయం తీసుకుంటాం'.. అని చెప్పారు. అనంతరం మరో గదిలోకి వెళ్లిన ఇద్దరు నేతలు 15 నిమిషాల పాటు ఏకాంతంగా చర్చించుకున్నారు. వీరి భేటీలో బీఆర్ఎస్ నాయకులు ఇందర్‌చెడ్ రాజు, అప్పూ, నయ్యూం, సికిందర్‌ఖాన్, మునీందర్‌రెడ్డి, రంగారెడ్డి, రజాక్, సునీల్ ప్రసాద్, నర్సిములు, కాంగ్రెస్ నాయకులు సిద్ధార్థ్ ఉన్నారు.

కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదు

తాండూరు: స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం తప్పదని తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో పెద్దేముల్, తాండూరు, యాలాల, కోట్‌పల్లి, బషీరాబాద్ మండలాల ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ బాకీ కార్డు ఉద్యమాన్ని ఇంటింటికి తీసుకెళ్లి ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ మెజార్టీ స్థానాలను సొంతం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ ఆయా మండలాల అధ్యక్షులు రవీందర్‌రెడ్డి, నర్సిరెడ్డి, సురేందర్, నాయకులు శ్రీనివాసాచారీ, పట్లోళ్ల నర్సింహులు, శ్రీనివాస్ రెడ్డి రాజప్ప తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు కర్రు కాల్చి వాత పెట్టాలి

- రిజర్వేషన్లలో మహిళలకు అన్యాయం
- మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి



ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న సబితారెడ్డి

నవాబుపేట: ఎన్నికల హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి స్థానిక సంస్థల ఎన్నికల్లో కర్రు కాల్చి వాత పెట్టాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. మంగళవారం నవాబుపేటలో నిర్వహించిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశానికి హాజరైన మాట్లాడారు. ఆరు గ్యారంటీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను నిలువునా మోసం చేసిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డివి మోస పూరిత వాగ్దానాలు అని మండిపడ్డారు. అధికారం చేపట్టిన వంద రోజుల్లో హామీలు అమలు చేస్తామని చెప్పి.. అప్పుల పేరిట ఎగ్గొట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో అన్ని స్థానాలను కైవసం చేసుకొని కేసీఆర్‌కు బహుమతిగా ఇద్దామన్నారు. 42 శాతం రిజర్వేషన్ల పేరుతో ఢిల్లీలో ధర్నాలు, జీఓలతో నాటకం ఆడుతున్నారని విమర్శించారు. మహిళలపై కేసీఆర్‌కు ఎనలేని అభిమానం ఉందన్నారు. అందుకే ప్రతి ఇంటికీ మిషన్ భగీరథ నీరు, దసరాకు కొత్త చీర ఇచ్చారని గుర్తు చేశారు. రాష్ట్రంలో 1,050 గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేస్తే అందులో 650 బాలికలు స్కూళ్లేనని పేర్కొన్నారు. మహిళలను కోటీశ్వరులను చేస్తామన్న సీఎం రేవంత్‌రెడ్డి ఎక్కడ చేశాడో చెప్పాలన్నారు. కనీసం కొడంగల్‌లోనైనా చేశారా అని నిలదీశారు. మహిళలకు రంగారెడ్డి జిల్లాలో 40 శాతం, వికారాబాద్ జిల్లాలో 30 శాతం మాత్రమే రిజర్వేషన్లు కేటాయించి అన్యాయం చేశారని అన్నారు. కేసీఆర్ పథకాల పేర్లు మార్చుతూ కాలం వెళ్లదీస్తున్నారని మండిపడ్డారు. అందుకే కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని తెలిపారు. నల్లధనం వెనక్కు తెస్తామన్న బీజేపీ ఆ ఊసే ఎత్తడం లేదన్నారు. ప్రతి ఒక్కరి ఖాతాలో రూ.15 లక్షలు వేస్తామని.. 15 రూపాయలు కూడా వేయలేదన్నారు. మాయమాటలతో పబ్బం గడుపుకొంటున్నారని విమర్శించారు. భారీ వర్షాలకు పంటలు దెబ్బతిన్నా ప్రభుత్వానికి రైతుల బాధలు పట్టడం లేదన్నారు. అనంతరం బీజేపీ మండల అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి పలు గ్రామాలకు చెందిన వారితో కలిసి బీఆర్ఎస్‌లో చేరారు. సబితారెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్, నాయకులు నాగేందర్‌గౌడ్, శుభప్రద్‌పటేల్, విజయ్‌కుమార్, దయాకర్‌రెడ్డి, బందయ్యగౌడ్, భరత్‌రెడ్డి, శాంతకుమార్, దాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అండగా ఉంటాం

రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్చడం ద్వారా పేద రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని, బాధితులకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని సబితారెడ్డి అన్నారు. నవాబుపేటకు వచ్చిన ఆమెను మండలంలోని చిట్టిగిద్ద, చించల్‌పేట, దాతాపూర్ గ్రామాలకు చెందిన భూ బాధిత రైతులు కలిశారు. తమకు న్యాయం జరిగేలా చూడాలని వినతి పత్రం అందజేశారు. స్పందించిన ఆమె మీకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని ఎవరూ ఆందోళన చెందాల్సి పని లేదన్నారు.

దసరాకు ఆకుకూరలేనా!

- విజయదశమి, గాంధీ జయంతి ఒకే రోజు రావడంతో..
- మాంసం, మద్యం ప్రియులకు షాక్

దుద్యాల్: దసరా పండుగ, గాంధీ జయంతి ఒకే రోజు రావడంతో ప్రజల్లో అయోమయం నెలకొంది. విజయదశమి రోజు జంతుబలి, మాంసం ఒండుకోవడం ఆనవాయితీగా వస్తోంది. మద్యం విక్రయాలు కూడా ఎక్కువగానే ఉంటాయి. అయితే జాతిపిత మహాత్మా గాంధీ జయంతి రోజు జంతు బలులు నిషేధం. మద్యం విక్రయించరు. ఈ రెండూ దసరా రోజు దొరికే అవకాశం లేకుండా పోయింది. దీంతో ప్రజలు ఏం చేయాలో తెలియక ఆందోళన చెందుతున్నారు. ఈ సారి పండుగను ఆకుకూరలతో జరుపుకోవాల్సి వస్తోందని పలువురు పేర్కొంటున్నారు. అయితే అక్టోబర్ 2వ తేదీ మాంసం దుకాణాలు మూసి ఉంటాయని, ముందు రోజు(అక్టోబర్ ఒకటవ తేదీ) మాంసం తీసుకెళ్లాలని దుకాణ యజమానులు బోర్డులు ఉంచారు.

మాంసం విక్రయించొద్దు

తాండూరు: మున్సిపల్ పరిధిలోని మాంసం దుకాణాలు, హోటళ్లను అక్టోబర్ 2న మూసి ఉంచాలని తాండూరు మున్సిపల్ కమిషనర్ బి.యాదగిరి ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం నోటీసులు జారీ చేశారు. మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా తాండూరులో మాంసం విక్రయాలు జరపరాదన్నారు. నిబంధనలను పాటించని వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ ఈ నిబంధన పాటించాలని సూచించారు. అనంతరం పట్టణంలోని మాంసం దుకాణ యజమానులకు, హోటల్ నిర్వాహకులకు నోటీసులు అందజేశారు.



తాండూరు: మాంసం దుకాణదారుడికి నోటీసు అందజేస్తున్న మున్సిపల్ సిబ్బంది

క్లుప్తంగా

గడువుతీరిన కుర్‌కురే తిని బాలుడికి అస్వస్థత



గడువు తీరిన ప్యాకెట్

ధారూరు: గడువుతీరిన కుర్‌కురే తిని ఓ బాలుడు అస్వస్థతకు గురయ్యాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. ధారూరుకు చెందిన ఇమ్రాన్(11) మంగళవారం మండల కేంద్రంలోని తాండూరు– హైదరాబాద్ ప్రధాన రోడ్డు పక్కనే ఉన్న ఓ కిరాణ షాప్‌లో కుర్‌కురే ప్యాకెట్ కొనుగోలు చేసి తిన్నాడు. కొద్దిసేపటికే వాంతులు చేసుకోవడంతో కుటుంబ సభ్యులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. బాలుడు తిన్న ప్యాకెట్‌ను పరిశీలించగా ఆగస్టు 10, 2025 వరకే గడువు తీరిపోయింది. సదరు దుకాణ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని బాధిత తల్లిదండ్రులు డిమాండ్ చేశారు.

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం



పుట్టపహాడ్‌లో అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ రమేశ్

కుల్కచర్ల: నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకమని కుల్కచర్ల ఎస్‌ఐ రమేశ్ పేర్కొన్నారు. మంగళవారం కుల్కచర్ల మండలం పుట్టపహాడ్ గ్రామంలో సీసీ కెమెరాలపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రతీ గ్రామంలో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ముఖ్యంగా దుకాణదారులు ఏర్పాటుచేయించుకుంటే నేరాలు అదుపుచేయొచ్చన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కవిత, స్థానిక నాయకులు వెంకట్రాములు, రాజశేఖర్, వెంకన్న, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

పూడూరులో రిజర్వేషన్లు ఖరారు

పూడూరు: పూడూరు మండలానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ రిజర్వేషన్లు ఖరారయ్యాయి. దీంతో ఆశావహులు సంబరాలు చేసుకుంటున్నారు. పూడూరు మండలంలో జెడ్పీటీసీ ఎస్సీ (మహిళ), ఎంపీపీ (ఎస్సీ మహిళ) రిజర్వు కావడంతో ఆయా పార్టీల నాయకులు అభ్యర్థుల వేటలో పడ్డారు. మండల పరిధిలో 13 ఎంపీటీసీ స్థానాలు ఇలా ఉన్నాయి. అంగడిచిట్టంపల్లి (బీసీ మహిళ), ఎన్కేపల్లి(జనరల్), మన్నేగూడ(బీసీ జనరల్), చన్గోముల్(బీసీ జనరల్), చీలాపూర్(ఎస్సీ మహిళ), పూడూరు(జనరల్), సోమన్‌గుర్తి(బీసీ మహిళ), పెద్ద ఉమ్మెంతాల్(ఎస్సీ జనరల్), మేడిపల్లికలాన్(ఎస్సీ జనరల్), కడుమూరు(బీసీ జనరల్), కంకల్(జనరల్ మహిళ), మంచన్‌పల్లి(బీసీ మహిళ), నిజాంపేట్‌మేడిపల్లి(జనరల్ మహిళ)గా రిజర్వ్ అయ్యాయి.

మండల పరిధిలోని 32 పంచాయతీలో..

మండల పరిధిలోని 32 పంచాయతీలకు సర్పంచ్ స్థానాలు ఇలా ఉన్నాయి.. అంగడిచిట్టంపల్లి (బీసీ మహిళ) అంగడిచిట్టంపల్లి (బీసీ జనరల్), బాకాపూర్ (బీసీ జనరల్), చీలాపూర్ (ఎస్సీ మహిళ), చన్గోముల్(బీసీ జనరల్), చింతలపల్లి (ఎస్సీ మహిళ), దేవనోనిగూడ (జనరల్ మహిళ), గట్టుపల్లి(జనరల్), గంగుపల్లి (ఎస్సీ జనరల్), కడుమూరు(ఎస్సీ జనరల్), కండ్లపల్లి(ఎస్సీ మహిళ), కంకల్(ఎస్సీ జనరల్), కెరవెళ్లి(జనరల్), కొత్తపల్లి(జనరల్ మహిళ), మంచన్‌పల్లి (బీసీ మహిళ), మన్నేగూడ(బీసీ మహిళ), మేడికొండ(బీసీ జనరల్), మేడిపల్లికలాన్(బీసీ మహిళ), మీర్జాపూర్(జనరల్), మిట్టకంకల్(బీసీ మహిళ), నిజాంపేట్‌మేడిపల్లి(బీసీ జనరల్), పెద్ద ఉమ్మెంతాల్(ఎస్సీ మహిళ), పుడుగుర్తి(బీసీ మహిళ), పూడూరు(బీసీ జనరల్), కుత్బుల్లాపూర్(బీసీ మహిళ), రాకంచర్ల(ఎస్టీ మహిళ), రేగడిమామిడిపల్లి(జనరల్), సిరిగాయపల్లి(జనరల్), సోమన్‌గుర్తి(ఎస్సీ జనరల్), తిమ్మాపూర్(జనరల్ మహిళ), తిరుమలాపూర్(జనరల్ మహిళ), తుర్క ఎన్కేపల్లి(జనరల్ మహిళ), ఎన్కేపల్లి (బీసీ జనరల్)గా రిజర్వేషన్లు అమలు కానున్నాయి. కాగా 9 నుంచి నామినేషన్ల ప్రక్రియ కొనసాగనుంది.

కృష్ణా నదిలో విద్యార్థి గల్లంతు

నాగార్జునసాగర్: స్నేహితులతో కలిసి హైదరాబాద్ నుంచి నాగార్జునసాగర్ ప్రాజెక్టును చూసేందుకు వచ్చిన ఇంటర్మీడియట్ విద్యార్థి కృష్ణా నదిలో గల్లంతయ్యాడు. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం..కూకట్‌పల్లికి చెందిన హర్షవర్ధన్, జ్ఞానేందర్, సుమన్, మణికంఠరెడ్డి, వెంకటేష్, చాణక్య (16)స్నేహితులు. వీరంతా వేర్వేరు కళాశాలల్లో ఇంటర్మీడియట్ ఫస్టియర్ చదువుతున్నారు. వీరంతా కలిసి నాగార్జునసాగర్ చూడటానికి రెండు బైక్‌లపై వచ్చారు. అందరూ కలిసి నాగార్జునసాగర్ డ్యాం దిగువన ఫొటోలు తీసుకున్నారు. అనంతరం కొత్త బ్రిడ్జి సమీపంలో చింతలపాలెం వెళ్లే దారి వెంట ఉన్న ఆంజనేయ పుష్కర ఘాట్‌లోకి దిగి స్నానాలు చేస్తుండగా.. చాణక్య నీటి ఉధృతికి కృష్ణా నదిలో కొట్టుకుపోయాడు.

చిన్నబోయిన 'చంద్రవంచ'

- గ్రామంలో కనిపించని పండుగ వాతావరణం
- స్థానికుల ముఖాలపై మాయమైన చిరునవ్వు
- దసరా వేళ జైలులోనే 33 మంది

తాండూరు రూరల్: ఏ గ్రామంలో చూసినా బతుకమ్మ, దసరా పండుగ సందడి కనిపిస్తుండగా.. మండల పరిధిలోని చంద్రవంచలో ఉద్విగ్న వాతావరణం నెలకొంది. ఇటీవల గ్రామంలో నిర్వహించిన వినాయక నిమజ్జన ర్యాలీ సందర్భంగా చోటుచేసుకున్న ఘర్షణే ఇందుకు కారణమైంది. వివరాలు ఇలా ఉన్నాయి.. చంద్రవంచలో తొంభై శాతానికి పైగా వ్యవసాయం, కూలీ పనులు చేసుకుని బతికేవారే. గత ఆగస్టు నెలలో నిర్వహించిన వినాయక నిమజ్జన వేడుకల్లో జరిగిన చిన్నపాటి గొడవ చినికిచినికి గాలివానలా మారి, ఇరువర్గాల వారు పరస్పర దాడులు చేసుకున్నారు. విధుల్లో ఉన్న ఓ కానిస్టేబుల్ వీరిని అడ్డుకునే ప్రయత్నం చేయగా, అతనిపై కూడా దాడి చేశారు. దీంతో గ్రామానికి చెందిన 33 మందిపై కేసులు నమోదయ్యాయి. ఆగస్టు 26న వీరిని రిమాండ్‌కు తరలించారు. నెల రోజులు దాటినా బెయిల్ దొరకకపోవడంతో జైల్లోనే ఉన్నారు. దీంతో ఇళ్ల వద్ద ఉన్న తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు తీవ్ర మానసిక వేదనను అనుభవిస్తున్నారు. తెలంగాణలో అతిపెద్ద పండుగైన దసరా రోజున తమ పిల్లలు జైలులో ఉండటాన్ని తట్టుకోలేకపోతున్నారు. బెయిల్ కోసం చేసిన ప్రయత్నాలు సఫలం కాకపోవడంతో తీవ్ర క్షోభకు గురవుతున్నారు.



చంద్రవంచ గ్రామం

అన్నాదమ్ముల్లా కలిసి ఉండాలి..

పుట్టిన ఊరు కన్నతల్లితో సమానం.. అందరూ కలిసిమెలిసి జీవించాలి. చిన్నచిన్న విషయాల్లో గొడవపడి ప్రశాంతమైన పల్లె వాతావరణాన్ని పాడుచేసుకోవద్దని పలువురు సూచిస్తున్నారు. జైలులో ఉన్నవారిలో చాలా మందికి చిన్న పిల్లలు ఉన్నారు. నిత్యం నాన్న ఎక్కడికి వెళ్లాడంటూ రోదిస్తున్నారు. వీరికి సమాధానం చెప్పడం, ఓదార్చడం కుటుంబ సభ్యులను మరింత కుంగదీస్తోంది.

ఆ గ్రామాలు సమస్యాత్మకం

తాండూరు మండలంలోని పలు గ్రామాలు సమస్యాత్మకంగా మారాయి. ఆయా జీపీల్లో జరుగుతున్న చిన్నపాటి ఘటనలు పెద్ద గొడవలకు దారి తీస్తున్నాయి. దీంతో తరచూ ఠాణాకు, కోర్టులకు వెళ్తున్నారు. ఇందులో రాజకీయ కక్షలు, వ్యక్తిగత విభేదాలు సైతం కనిపిస్తున్నాయి. కరన్‌కోట్, మల్కాపూర్, సంగెంకలాన్ అల్లాపూర్, జినుగుర్తి, కొత్లాపూర్, వీర్‌శెట్టిపల్లి తదితర గ్రామాలు జఠిలమైనవిగా పోలీసు కేసులు, గతంలో జరిగిన ఘటనలు సూచిస్తున్నాయి. పోలీసులు స్పందించి ఆయా గ్రామాల్లో దసరా రోజున బందోబస్తు ఏర్పాటు చేస్తే బాగుంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

సత్ప్రవర్తనతో మెలగాలి



మనిషి జీవితం చిన్నది.. ఏదీ శాశ్వతం కాదు. పగలు, పంతాలు, ప్రతీకారాలు పెట్టుకోవద్దు. అందరూ అన్నాదమ్ముల్లా కలిసిమెలిసి ఉండాలి. ప్రతిఒక్కరూ సత్ప్రవర్తనతో మెలగాలి. సమస్యాత్మక గ్రామాల్లో ఇప్పటికే అవగాహన కార్యక్రమాలు నిర్వహించాం. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిని ఉపేక్షించేది లేదు.

– నగేష్, తాండూరు రూరల్ సీఐ

అక్రమ నిర్మాణ పనులు నిలిపేయాలి

సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య

దోమ: అనుమతులు లేకుండా నిర్మిస్తున్న ఇంటి నిర్మాణ పనులను వెంటనే నిలిపేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.వెంకటయ్య డిమాండ్ చేశారు. మంగళవారం దిర్సంపల్లి గ్రామంలో గ్రామానికి చెందిన కూర శ్రీశైలానికి సర్వేనంబర్ 16/1లో 135 గజాల స్థలం ఉంది. అట్టి ప్లాట్‌లో గ్రామానికి చెందిన కొత్తకాపు నర్సింహారెడ్డి, సర్వారెడ్డి అనే వ్యక్తులు ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇంటి నిర్మాణం చేపడుతున్నారన్నారు. వెంటనే అట్టి నిర్మాణాన్ని అధికారులు నిలిపేసి వారిపై తగిన చర్యలు తీసుకోవాలని మండల పరిషత్ అధికారులకు వినతి పత్రం అందజేశారు. లేని పక్షంలో బాధితుల పక్షాన ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.



పనులు నిలిపేయాలని వినతి పత్రం అందజేస్తున్న వెంకటయ్య



అలుగులో పర్యాటకుల సందడి

హస్నాబాద్ చెరువు అలుగు పారుతుండడంతో వారం రోజులుగా పర్యాటకులతో సందడి వాతావరణం నెలకొంది. నిత్యం వందల మంది వీక్షిస్తున్నారు. గ్రామస్తులే కాకుండా చుట్టు పక్కల గ్రామాలకు చెందిన వారు అలుగు నీటిలో ఎంజాయ్ చేస్తున్నారు. మంగళవారం చిన్నారులు, మహిళలు సందడి చేశారు. – దుద్యాల్

రోడ్డు బాగోలేక రాకపోకల నిలిపేత



రాళ్లచిట్టెంపల్లి వద్ద రోడ్డు పరిస్థితి

- బస్సు సర్వీసులు రద్దుచేసిన ఆర్టీసీ అధికారులు
- ఐదు రోజులుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు



జిన్నారం సమీపంలో గుంతల రోడ్డు

బంట్వారం: రోడ్డు బాగలేకపోవడంతో ఆర్టీసీ అధికారులు బస్సు సర్వీసులను రద్దు చేశారు. బంట్వారం మండలంలోని నూరుల్లాపూర్ వాగు దగ్గర భారీ వర్షాలకు ఆర్‌అండ్‌బీ రోడ్డు తెగిపోవడంతో ఐదు రోజుల నుంచి రాకపోకలు నిలిపేశారు. హైదరాబాద్–2, వికారాబాద్, తాండూరు డిపోలకు చెందిన బస్సులు నిత్యం బంట్వారం, తొర్మామిడికి నడిపించేవారు. రోడ్డు అధ్వానంగా తయారవ్వడంతో బస్సులు తిప్పడం లేదు. అలాగే వికారాబాద్, కోట్‌పల్లి మార్గంలో ఆర్‌అండ్‌బీ రోడ్డు నిర్మాణం కోసం రాళ్లచిట్టెంపల్లి దగ్గర గుట్టను తవ్వడంతో పూర్తిగా బురదమయంగా మారింది. ఇక్కడినుంచి బైకులపై వెళ్లేవారు జారీ కిందపడుతున్నారు. మైలార్‌దేవరంపల్లి నుంచి జిన్నారం వరకు రోడ్డు పూర్తిగా గుంతలుగా మారింది. ఇలాంటి పరిస్థితుల్లో బస్సులు నడపలేమని ఆర్టీసీ అధికారులు చేతులెత్తేశారు. వికారాబాద్–కోట్‌పల్లి లోకల్ బస్సును ఐదు రోజుల నుంచి రద్దు చేశారు. ఈ బస్సును రోజుకు 6 ట్రిప్పులు నడిపించేవారు. బస్సును రద్దు చేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అయినప్పటికీ ఈ విషయాన్ని పట్టించుకునే అధికారులు కరువయ్యారు. దసరా వేళ బస్సులను రద్దు చేయడంతో బంట్వారం, కోట్‌పల్లి రూటులో వెళ్లే వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే దెబ్బతిన్న రోడ్లకు కనీసం మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు. లేనిచో వికారాబాద్ ఆర్‌అండ్‌బీ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ధర్నా చేస్తామని హెచ్చరించారు.

కారు ఢీకొని ద్విచక్ర వాహనదారుడు మృతి

మేడ్చల్ రూరల్: ఔటర్ రింగు రోడ్డుపై ప్రయాణించడానికి ద్విచక్ర వాహనాలకు అనుమతి లేదని తెలిసీ రాంగ్ రూట్లో ఔటర్ ఎక్కి ప్రాణాలు కోల్పోయాడో వ్యక్తి. ఈ సంఘటన మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం..మెదక్ జిల్లా గొల్లపల్లికి చెందిన బోయిని కృష్ణ (52) నర్సాపూర్ నుంచి శామీర్‌పేట్ వైపు వస్తూ ఓఆర్‌ఆర్ ఎగ్జిట్–5 దుండిగల్ వద్ద ద్విచక్ర వాహనంపై టోల్ గేట్ సిబ్బంది వారిస్తున్నా వినిపించుకోకుండా..ఓఆర్‌ఆర్ ఎక్కాడు. అతి వేగంగా దుండిగల్ నుంచి శామీర్‌పేట వైపు రాంగ్ రూట్లో ప్రయాణించాడు. మునీరాబాద్ వద్ద ఎగ్జిట్‌కు సమీపంలోకి రాగానే కారు బైక్‌ను ఢీ కొట్టింది.

సిటీలో పీపుల్ వెల్ఫేర్ పోలీసింగ్

శాంతిభద్రతలతో పాటు సంక్షేమానికీ ప్రాధాన్యం

- కల్తీల నిరోధానికి ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు
- మార్కెటింగ్ ఇంటెలిజెన్స్ యూనిట్‌కు రూపం
- సీసీ కెమెరాల ఆడిటింగ్‌తో సమగ్ర నిర్వహణ
- ప్రాధాన్యాలు వెల్లడించిన నగర సీపీ వీసీ సజ్జనర్

సాక్షి, సిటీబ్యూరో: నగర పోలీసు కమిషనరేట్‌లో పీపుల్ వెల్ఫేర్ పోలీసింగ్ ఆవిష్కృతం కానుందని కొత్త కొత్వాల్ విశ్వనాథ్ చెన్నప్ప సజ్జనర్ తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నిరోధంతో పాటు ప్రజా సంక్షేమానికీ పెద్దపీట వేస్తూ విధానాలు రూపొందిచనున్నామని ఆయన పేర్కొన్నారు. బంజారాహిల్స్‌లోని తెలంగాణ స్టేట్ ఇంటిగ్రేడెట్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో (టీజీఐసీసీసీ) మంగళవారం నగర పోలీసు కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

ప్రస్తుత విధానాలే కొనసాగింపు..

గడచిన కొన్నేళ్లుగా నగర పోలీసింగ్‌లో అనేక సంస్కరణలు వచ్చాయి. అమలులో ఉన్న విధానాలు కొనసాగిస్తూనే అవసరమైన స్థాయిలో కొత్తవి అందుబాటులోకి తీసుకువస్తాం. ప్రజా సంక్షేమ పోలీసింగ్‌లో భాగంగా నగర ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెడతాం. ఆహార కల్తీని నిరోధించడానికి ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేస్తాం. ఏయే సరుకులు ఎలా కల్తీ అవుతున్నాయో గుర్తించడానికి మార్కెటింగ్ ఇంటెలిజెన్స్ యూనిట్‌కు రూపమిస్తాం. ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపే డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపుతాం. ఈ కేసుల్లో నిందితులతో డేటా బ్యాంక్ ఏర్పాటు చేసి ఇతర విభాగాలతో సమన్వయంతో పని చేస్తాం.

సైబర్ నేరాలపై పోరు..

ఎప్పటికప్పుడు పంథా మారుస్తూ నానాటికీ రెచ్చిపోతున్న సైబర్ నేరగాళ్లకు చెక్ చెప్పడానికి ప్రత్యేక ప్రాధాన్యమిస్తాం. ఇటీవల కాలంలో వృద్ధులే ఎక్కువగా టార్గెట్‌గా మారుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ తమ ఇళ్లల్లోని వృద్ధులపై దృష్టి పెట్టాలి. పోలీసు విభాగానికి దూరంగా ఉన్నా బెట్టింగ్ యాప్స్‌పై ఇప్పటికే 'హ్యాష్‌ట్యాగ్ సే నో టు బెట్టింగ్ యాప్స్' పేరుతో ఉద్యమం చేశా. ఫలితంగానే వాటిని నిషేధిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మల్టీ లెవల్ మార్కెటింగ్స్, రియల్ ఎస్టేట్ మోసాలు, భూ కబ్జాలపై కఠిన వైఖరి ఉంటుంది. మహిళలపై నేరాలకు పాల్పడే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం. ఈ నేరాలకు పాల్పడే వారు తమ ఇంట్లో ఉన్న తల్లి, సోదరి, భార్యల్ని గుర్తు చేసుకుని, మహిళల్ని గౌరవించాలి.

ప్రతి ఒక్కరి 'ఫ్యామిలీ టైమ్' పెంచుతాం...

నగరంలో నానాటికీ వాహనాల సంఖ్య పెరిగిపోతోంది. ట్రాఫిక్ సమస్యలతో వాహనచోదకులు ఎక్కువ సమయం రోడ్లపై ఉండాల్సి వస్తోంది. ఈ ప్రభావంతో వారు కాలుష్యం బారినపడి ఆరోగ్యం పాడు చేసుకుంటున్నారు. కుటుంబాలతో వారు గడిపే సమయం కూడా తగ్గిపోతోంది. రహదారులపై వాహనాల సరాసరి వేగం పెంచడంతో పాటు కాలుష్యం తగ్గించి, నగర వాసులు తమ కుటుంబాలతో గడపడానికి ఎక్కువ సమయం మిగిలేలా చేస్తాం. డ్రంక్ డ్రైవింగ్ అనేది రోడ్ టెర్రరిజం. డ్రంక్ డ్రైవర్లు సూసైడ్ బాంబర్లు. వీరి వల్ల ఎన్ని ప్రాణాలైనా పోవచ్చు. కుటుంబాలు వీధినపడే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలోనే మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు ఉంటాయి. పోలీసింగ్‌లో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), డ్రోన్లు వినియోగిస్తాం.

పెద్దల్ని వదిలేస్తే సీనియర్ సిటిజన్స్ యాక్ట్..

ఇటీవల కాలంలో అనేక మంది వృద్ధులైన తమ కుటుంబీకుల్ని బస్టాండ్లు, రైల్వే స్టేషన్లతో పాటు బహిరంగ ప్రదేశాల్లో వదిలేసి వెళ్లిపోతున్నారు. ఇప్పటికే ఇలాంటి వారిపై రెస్క్యూ కార్యక్రమాలు నడుస్తున్నాయి. ఇకపై ఈ పని ఎవరైనా చేస్తే సీనియర్ సిటిజన్స్ యాక్ట్ కింద చర్యలు తీసుకుంటాం. నగరంలోని ప్రతి భవనంపైనా ఓ సీసీ కెమెరా ఉండాలి. ప్రస్తుతం ఉన్న వాటిని ఆడిటింగ్ చేయడం ద్వారా అన్నీ పని చేసేలా చర్యలు తీసుకుంటాం. అహర్నిశలు కష్టపడే పోలీసు సిబ్బంది సంక్షేమానికీ పెద్దపీట వేస్తాం. ఉత్తమ పనితీరును కనబరిచిన ఉన్నతాధికారి నుంచి హోంగార్డు వరకు అందరికీ రివార్డులు అందిస్తాం. దీనికోసం ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేస్తాం. నేరగాళ్లకు జ్యురిస్‌డిక్షన్ ఉండదు. ఈ నేపథ్యంలోనూ మూడు కమిషనరేట్లు సమన్వయంతో పని చేయనున్నాయి. సోషల్‌మీడియాను దుర్వినియోగం చేసే వారిపై చర్యలు తప్పవు.

మీ పిల్లలపై ఓ కన్నేసి ఉంచండి..

మైనర్లు చేసే నేరాలు పెరిగిపోతున్నాయి. వాళ్లు ఆ పని చేసే వరకు తల్లిదండ్రులకూ వారి ప్రవర్తన తెలియట్లేదు. స్మార్ట్‌ఫోన్ యుగంలో ప్రతి ఒక్కరూ వారి బిడ్డల కార్యకలాపాలు, ఆన్‌లైన్ స్నేహాలు, క్రయవిక్రయాలపై కన్నేసి ఉంచాలి. టీజీఐసీసీసీలోని కమిషనరేట్, బషీర్‌బాగ్‌లోని ఓల్డ్ కమిషనరేట్, పాతబస్తీలోని కొత్వాల్ హౌస్‌ల నుంచి పని చేస్తా. ఎప్పుడు ఎక్కడ ఉంటాననే ప్రణాళికను త్వరలోనే విడుదల చేస్తా. ప్రతి పౌరుడు ఓ పోలీసు లాంటి వాడే. తమ చుట్టూ ఉన్న అసాంఘికశక్తులు, కార్యకలాపాలపై కన్నేసి ఉంచి పోలీసులకు సమాచారం ఇచ్చి సహకరించాలి. ప్రజలకు ఎలాంటి సమస్య వచ్చినా, సహాయం కావాలన్నా అన్ని స్థాయిల్లోని అధికారులం నిర్విరామంగా అందుబాటులో ఉంటాం. హైదరాబాద్ యాంటీ నార్కోటిక్స్ వింగ్‌కు (హెచ్–న్యూ) సిబ్బంది, వనరులు కేటాయించి దాన్ని బలోపేతం చేస్తాం.



బాధ్యతల స్వీకరణ అనంతరం కుటుంబ సభ్యులతో సజ్జనర్

అక్కడ 17,631



ఇక్కడ 4,855

అత్యధిక సైబర్ నేరాల కేసులు బెంగళూరులోనే

- ఆ తర్వాత స్థానంలో నిలిచిన హైదరాబాద్
- 2023 గణాంకాలను వెల్లడించిన ఎన్సీఆర్బీ
- ఆధారాలు లేక మూతపడుతున్నవే అధికం

నగరంలో సైబర్ నేరాలు ఇలా..

ఏడాది	నేరాలు
2020	2,553
2021	3,303
2022	4,436
2023	4,855



ఇతర నగరాల్లో ..

ఏడాది	2020	2021	2022	2023
బెంగళూరు	8,892	6,423	9,940	17,631
ముంబై	2,433	2,883	4,724	4,131
లక్నో	1,465	1,067	1,134	1,453
ఢిల్లీ	166	345	685	407
కోల్‌కతా	172	220	75	21

సాక్షి, సిటీబ్యూరో

నగరంలో సైబర్ నేరాలు నానాటికీ పెరుగుతున్నాయా..? ఈ–కేటుగాళ్లకు హైదరాబాద్ సాఫ్ట్ టార్గెట్‌గా మారుతోందా..? ఔననే అంటున్నాయి నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్సీఆర్బీ) వర్గాలు. 2023కు సంబంధించిన డేటాను ఎన్సీఆర్బీ మంగళవారం విడుదల చేసింది. దీని ప్రకారం సైబర్ నేరాల నమోదులో హైదరాబాద్ నగరం దేశంలోనే రెండో స్థానంలో ఉంది. ఇక్కడ 2023లో 4,855 కేసులు నమోదయ్యాయి. 17,631 కేసులతో మొదటి స్థానంలో బెంగళూరు ఉండగా.. 4,131 కేసులతో ముంబై మూడో స్థానంలో ఉంది. 2022లో మూడో స్థానంలో ఉన్న హైదరాబాద్ ఏడాదిలోనే రెండో స్థానానికి వెళ్లింది.

బ్యాంకింగ్ ఫ్రాడ్స్ కేసులే అత్యధికం..

హైదరాబాద్‌లో నమోదవుతున్న సైబర్ నేరాల్లో ఆన్‌లైన్ బ్యాంకింగ్ సంబంధిత మోసాల కేసులే ఎక్కువగా నమోదవుతున్నాయి. 2,858 సంఖ్యతో మొత్తం కేసుల్లో 58.86 శాతం ఇవే ఉన్నట్లు ఎన్సీఆర్బీ స్పష్టం చేస్తోంది. బ్యాంకు అధికారుల పేర్లతో ఫోన్లు చేసే సైబర్ నేరగాళ్లు వినియోగదారులను నిండా ముంచుతున్నారు. బ్యాంకు ఖాతాల వివరాలు అప్‌డేట్ చేయాలని, నో యువర్ కస్టమర్ (కేవైసీ) తప్పనిసరి అంటూ నమ్మిస్తున్నారు. ఈ పేర్లతో వినియోగదారుల నుంచి బ్యాంకు ఖాతాతో పాటు వ్యక్తిగత వివరాలు, వన్ టైమ్ పాస్‌వర్డ్స్ (ఓటీపీ) సంగ్రహిస్తున్నారు. వీటిని వినియోగించి ఎదుటి వారి ఖాతాలను గుల్ల చేస్తూ అందినకాడికి దండుకుంటున్నారు. ఏటీఎం కార్డులు, కేంద్రాలు కేంద్రంగా జరిగే సైబర్ నేరాల సంఖ్య ఎక్కువగానే ఉంటోంది. 2023లో నగర వ్యాప్తంగా ఈ తరహా కేసులు 211 నమోదయ్యాయి.

'క్లూ' దొరకని కేసులే అధికం..

ఈ సైబర్ నేరాల్లో బాధితులు మోసపోవడం ఎంత తేలికో.. కేసు కొలిక్కి రావడం, నగదు రికవరీ అంత కష్టం. అత్యధిక కేసుల్లో దర్యాప్తు ముందుకు వెళ్లడానికి కనీసం ఒక్క ఆధారం కూడా దొరకదు. ఈ సైబర్ నేరగాళ్లు నేరాలు చేసే సమయంలో అనేక జాగ్రత్తలు తీసుకుంటారు. సిమ్‌కార్డులు, బ్యాంకు ఖాతాలు తమ పేర్లు, వివరాలతో లేకుండా నేరం చేస్తారు. వీళ్లు వినియోగించే ఇంటర్నెట్ ప్రొటోకాల్ (ఐపీ) అడ్రస్ కూడా దర్యాప్తు సంస్థలకు తెలియకుండా ఉండేందుకు ప్రాక్సీ సర్వర్లు వినియోగిస్తారు. కొందరు పాత్రధారులు, దళారులు మినహా సూత్రధారులు అంతా విదేశాల్లోనే తిష్ట వేస్తుంటారు. అక్కడి వివరాలు సేకరించడానికి ఇక్కడి పోలీసులకు ఏమాత్రం అవకాశం ఉండదు. ఈ కారణంగానే అత్యధిక కేసుల్లో ఆధారాలు సేకరించడం పోలీసులకు సాధ్యం కావట్లేదు. దీంతో బాధితుడు మోసపోవడం, నష్టపోవడం నిజమైనప్పటికీ అధికారులు ఏమీ చేయలేకపోతున్నారు. 2023లో నగరంలో నమోదైన 4,855 కేసుల్లో 2733 (56.29 శాతం) ఆధారాలు లేకపోవడంతో క్లోజ్ అయ్యాయి.

ప్రతి ఫిర్యాదునూ నమోదు చేస్తున్నాం

భవిష్యత్తులో సైబర్ నేరాలు, ఉగ్రవాదమే పెను సవాల్‌గా మారే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలోనే ఇక్కడ ప్రతి ఫిర్యాదును కేసుగా నమోదు చేస్తున్నాం. ఆర్థిక సంబంధిత నేరాల్లో రూ.లక్ష కంటే ఎక్కువ మొత్తంతో ముడిపడిన కేసులను సైబర్ క్రైమ్ ఠాణాలో, మిగిలిన వాటిని స్థానిక పోలీసు స్టేషన్లలో రిజిస్టర్ చేసి దర్యాప్తు చేయిస్తున్నాం. కొన్ని సున్నితమైన కేసుల్లో ఒకప్పుడు బాధితులు.. ప్రధానంగా మహిళలు బయటకు వచ్చి ఫిర్యాదు చేసేవాళ్లు కాదు. ఇటీవల కాలంలో అవగాహన పెరిగిన కారణంగా ఈ పరిస్థితి లేదు. దీంతో ప్రతి ఏడాది నగరంలో సైబర్ క్రైమ్ కేసులు పెరుగుతున్నాయి. వీటిని నిరోధించడానికి అనేక చర్యలు తీసుకుంటున్నాం. పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ కాలేజీలు, స్కూళ్ల వరకు వెళ్తున్నాం.

– నగర పోలీసు అధికారి